
'తుమ్మిడిహెట్టి'తో సాగుకు ఊతం..!



2



2

మహిళా సంఘాలకు రుణాలతో ఆర్థికభరోసా

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

29-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## 'సర్' ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**అక్షరటుడే, ఇందూరు:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుపై శిక్షణ, ఓటరు మ్యాపింగ్ పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 పర్యాయాలు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సీఈవో వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుందని స్పష్టం చేశారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంలో జాప్యం తగదు




**అక్షరటుడే, ఇందూరు:** బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం విషయంలో రాజకీయ పార్టీలు జాప్యం చేయకుండా నిర్ణీత ఫార్మాట్‌లో పేర్లను అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలులో బీఎల్ఏల పాత్ర ఎంతో కీలకమని వారి నియామకంలో తాత్సారం చేయవద్దన్నారు. కలెక్టరేట్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌వోల, ఏఈఆర్‌వోలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్ఐఆర్‌ను అమలు చేస్తోందన్నారు. ఈ మేరకు నిర్ణీత షెడ్యూల్‌ను కూడా వెలువరించిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం ద్వారా గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. నిర్ణీత ఫార్మాట్‌లో వారి వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఈఆర్‌వోలను ఆదేశించారు. బీఎల్ఏల నియామకం కోసం ఇప్పటికే రాజకీయ పార్టీలను లిఖిత పూర్వకంగా కోరినప్పటికీ, ఇంకా వివరాలు అందించలేదన్నారు. కేవలం ఒక పార్టీ మాత్రమే రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్ఏల వివరాలు సమర్పించిందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించి బీఎల్ఏలకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ముసాయిదా ఓటరు జాబితాలోని అంశాలపై ఏవైనా అభ్యంతరాలుంటే, బీఎల్ఏలు వాటిని ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈఆర్ఓల స్థాయిలో ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరు గురించి వారికి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీవో విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు పాల్గొన్నారు.

**ప్రాణాలను కాపాడాల్సిన ఆస్పత్రులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. చిన్న వ్యాధితో వెళ్లినా.. టెస్ట్‌ల పేరుతో రోగుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలతో పలు ఆస్పత్రులు కుమ్మక్కయ్యాయి. వారికి కమీషనలు ఆశ చూపి గ్రామీణ ప్రాంత ప్రజలను తమ ఆస్పత్రులకు వచ్చేలా చూసుకుంటున్నారు. అనంతరం దోపిడీ ప్రారంభిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.**

- అక్షరటుడే, భీమ్‌గల్

# ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ




- ఆర్ఎంపీలు, పీఎంపీలతో కుమ్మక్కు
- రోగుల నుంచి అందిన కాడికి దండుకుంటున్న వైనం
- నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా సీజేరియన్
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు ఉన్నాయి. జిల్లాకేంద్రంలోనే వందలాది హాస్పిటళ్లు వెలిశాయి. అయితే వీటిలో అనేక ఆసుపత్రులు నిబంధనలను తుంగలో తొక్కుతూ, కనీస వసతులు లేకుండానే రోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. సాధారణ జ్వరం అని వస్తే చాలు, వేల రూపాయల విలువైన అనవసర పరీక్షలు చేయిస్తూ రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

### అవసరం లేకున్నా సీజేరియన్

రెండేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ, వైద్య నిర్లక్ష్యంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం డబ్బుల కోసం గర్భిణులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతపు సిజేరియన్లు చేస్తున్న ఉదంతాలు మితి మీరిపోయాయి. ఈ దోపిడీ నెట్‌వర్క్ వెనుక ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యా లు, క్షేత్రస్థాయిలో ఉండే ఆర్ఎంపీ, పీఎంపీల మధ్య ఉన్న బంధం ప్రధాన కారణమని తెలుస్తోంది. పల్లెల్లో, పట్టణాల్లోని పేదలు ఏదైనా అనారోగ్యం బారిన పడితే మొదటగా స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తారు. ఇదే అదనుగా భావించే కొందరు ఆర్ఎంపీలు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ.. చికిత్సకు అయ్యే మొత్తం బిల్లులో ఏకంగా 30 శాతం వరకు కమీషన్లు దండుకుంటున్నారు.

### కమీషన్లతో పాటు టూర్లు

కేవలం డబ్బులే కాకుండా ఆర్ఎంపీలు, పీఎంపీలను ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేట్ ఆస్పత్రులు గోవా వంటి ప్రాంతాలకు టూర్లకు తీసుకు వెళ్తున్నట్లు సమాచారం. విలాసవంతమైన బహుమతులు, బంగారం వంటి నజరానాలను ఎరగా వేస్తున్నాయి. వీటికి తోడు సదరు క్లినిక్ నిర్వాహకుల పుట్టినరోజులు, పెళ్లిరోజుల వేడుకలను కూడా ఆస్పత్రుల యాజమాన్యాలే స్వయంగా ఖర్చు భరించి ఘనంగా నిర్వహిస్తుండడం ఈ నెట్‌వర్క్ ఎంత బలంగా ఉందో అర్థం చేస్తోంది.

### ప్రాణాలు పోతున్నా..

ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూస్తున్నాయి. నందిపేట మండలానికి చెందిన పోశెట్టి, కామారెడ్డికి చెందిన గర్భిణి మృతి చెందడం తీవ్ర కలకలం రేపాయి. అయినప్పటికీ యాజమాన్యాలు రాజకీయ రికమండేషన్లతోనో, బాధితులకు డబ్బులు ఆశజూపి సెటిల్‌మెంట్ చేసుకుంటూ తప్పించుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, ఇటీవల జారీ చేసిన సర్క్యులర్ల ప్రకారం కమీషన్ల దందాను అరికట్టేలా ప్రైవేట్ ఆసుపత్రులపై పటిష్టమైన నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించే ఆర్ఎంపీ కేంద్రాలు, ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### తనిఖీలు చేపట్టినా..

ఈ అక్రమ దందాలపై గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించి, అనవసరంగా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తూ రోగులపై ఆర్థిక భారం మోపుతున్న 54 ప్రైవేట్ ఆసుపత్రులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటిలో నిజామాబాద్ నగరంలోనే 37 ఆస్పత్రులు ఉండగా, ఆర్మూర్‌లో 9, బోధన్‌లో మిగిలిన ఆసుపత్రులు ఉన్నాయి. అలాగే వారం రోజుల పాటు జిల్లాలోని 145 ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో కనీస సదుపాయాలు లేని, నిబంధనలు పాటించని 48 ప్రైవేట్ ఆస్పత్రులపై కేసులు నమోదు చేసి నోటీసులు ఇచ్చారు. భీమ్‌గల్‌లోని అనుమతులేని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేశారు. క్వాలిఫైడ్ డాక్టర్లు లేకుండా వైద్యం అందిస్తున్న రెండు ఆసుపత్రులను పూర్తిగా సీజ్ చేయడంతో పాటు, ఎలాంటి అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నడుపుతున్న 'శ్రీ ఓం క్లినిక్' వంటి కేంద్రాలను అధికారులు తనిఖీల్లో గుర్తించి తాళాలు వేశారు. అయితే మళ్లీ ఆయా ఆస్పత్రులను యథావిధిగా నడిపిస్తున్నారు. సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టడంతో ఆస్పత్రులవైపు చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్


**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర ప్రభుత్వ పథకాలను, బీజేపీ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని బోర్గాంలో జరుగుతున్న బీజేపీ 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు' శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలతో సంబంధం లేకుండా పార్టీ సమాజంలో నిరంతరం పనిచేయాలని, అన్ని అనుబంధ సంస్థలు సమన్వయంతో సాగాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలో భారతదేశ గౌరవం పెరిగిందని, కేంద్ర పథకాలు గ్రామస్థాయి వరకు చేరుతున్నాయని చెప్పారు. ముగింపు సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి, కర్ణాటక బెల్గావి ఎమ్మెల్యే అభయ్ పాటిల్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సన్మానించారు.




## రెడ్ క్రాస్ సభ్యత్వ విస్తరణకు కృషి చేస్తాం..

**అక్షరటుడే, బోధన్:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ విస్తరణకు కృషి చేస్తామని బోధన్ ఆర్డీవో విజయ్ కుమారి పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ సేవా కార్యక్రమాలను, సభ్యత్వ ప్రాధాన్యతను ఆమెకు వివరించారు. దీనిపై ఆర్డీవో సానుకూలంగా స్పందిస్తూ... తమ కార్యాలయ సిబ్బందితో పాటు, డివిజన్‌లోని ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బోధన్ తహశీల్దార్ విఠల్‌ను కూడా కలవగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ సభ్యత్వ విస్తరణ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేరువవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు, బోధన్ డివిజన్ చైర్మన్ బసవేశ్వర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రావు, బోధన్ మండల చైర్మన్ కొడాలి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





## గౌడ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గౌడ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని, గౌడ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాల లో శుక్రవారం ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గౌడ వి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వారిని 'ప్రతిభ పురస్కారాలు' అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ మాట్లాడుతూ.. నేటి యువత విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుంటేనే గౌడ సమాజానికి గౌరవం పెరుగుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత పదవులు సాధించాలని సూచించారు. గౌడ సమాజంలోని ప్రతి కుటుంబం తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్, అధికార ప్రతినిధి దత్తాత్రి గౌడ్, నాయకులు క్రాంతి కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బొమ్మగోని శంకర్ గౌడ్, కేశవ్ గౌడ్, రంగోళ్ల మురళి గౌడ్, అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## తడిసిన వడ్లు కొనకుంటే ఆందోళన చేస్తాం..: జాజాల

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనకుంటే రోడ్లను దిగ్బంధం చేస్తామని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. నాగిరెడ్డిపేట మండలం గొలిలింగాల గ్రామంలో రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. గొలిలింగాల గ్రామంలో రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకపోవడంపై మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షం కారణంగా ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. తడిసిన వడ్లకు మొలకలు వచ్చినా అధికారులు స్పందించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో పాలకులు, అధికారులు రైతుల ఉసురు పోసుకుంటున్నారన్నారు. రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల వద్దే కాపలా ఉంటున్నారని, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆయన వాపోయారు. తడిసిన ధాన్యాన్ని తేమ, తాలు పేరుతో తిరస్కరిస్తారేమోనని రైతులు భయపడుతున్నారన్నారు. అసమర్థ పాలనతో రైతులు బేజారవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే దిక్కు లేకుండా చేశారని మండిపడ్డారు. రాబోయే రెండు రోజుల్లో కల్లాల్లోని మొత్తం వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, తడిసిన ప్రతి గింజకూ మద్దతు ధర చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే జాతీయ రహదారిపై ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, రైతు సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
శుక్రవారం
29.5.2026
www.aksharatoday.in
AKSHARA TODAY




## పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వ పథకాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌తో కలిసి నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నిజాంసాగర్ మండలాధ్యక్షుడు ప్రజా పండరి, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు రుణాలు మంజూరు



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా పల్లి మండలంలోని కోన సముందర్ గ్రామంలో మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుంచి శుక్రవారం సంఘం సభ్యులకు రూ.2 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ఎంపీడీవో రాజ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో టీజీబీ రీజినల్ మేనేజర్, కోన సముందర్ టీజీబీ మేనేజర్, సర్పంచ్, ఐకేపీ సిబ్బంది గ్రామ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నాలుగో రోజుకు చేరిన వీవోఏల నిరవధిక సమ్మె




**అక్షరటుడే,ముప్కాల్:** తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు లోహిత మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే సాధారణ, ఆరోగ్య బీమా సదుపాయాలను రూ.20 లక్షల వరకు వర్తింపజేయాలని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలని వీవోఏలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు లోహిత, కార్యదర్శి రాధిక, కోశాధికారి విజయతో పాటు మండలంలోని వివిధ గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

# 'తుమ్మిడిహెట్టి'తో సాగుకు ఊతం..!



గ్రావిటీ ద్వారా ఉత్తర తెలంగాణకు నీళ్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రాణహిత చేవెళ్ల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. ప్రాజెక్టుపై చర్చించేందుకు తెలంగాణ ప్రతినిధుల బృందానికి సమయం ఇవ్వాలని కోరారు. సయోధ్య కుదిరిన పక్షంలో దశాబ్దాల కల అయిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ పూర్తయితే నిజామాబాద్ సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

– అక్షరటుడే, ఆర్మూర్

■ జిల్లా సాగు రూపురేఖలు మార్చే ప్రాజెక్ట్ ■ బ్యారేజీతో రెండు పంటల కల సాకారం ■ 1.8 లక్షల ఎకరాలకు సాగునీరు, 3.5 లక్షల జనాభాకు తాగునీరు

గోదావరిపై మహారాష్ట్ర సరిహద్దులో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం మండలం తుమ్మిడి హెట్టి వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరనుంది. తుమ్మిడి హెట్టి బ్యారేజీ నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లోకి ఎత్తిపోయనున్నారు. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ జరగడంతో పాటు కొత్త ఆయకట్టుకు నీరందనుంది.

### జిల్లాలో లబ్ధి పొందే మండలాలు...

బాల్కొండ నియోజకవర్గంలో మెండోరా, బాల్కొండ, మోర్తాడ్ మండలాల్లోని చివరి భూములకు రెండో పంటకు నీరందుతుంది. సుమారు 42,000 ఎకరాలు స్థిరీకరణ జరుగుతుంది. ఆర్మూర్ నియోజకవర్గంలో మాక్లూర్, నందిపేట్ మండలాల్లో కొత్తగా 25,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్న చెరువులు, కుంటలను నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. బోధన్ నియోజకవర్గంలో రెంజల్, ఎడపల్లి, వర్ని మండలాల్లో నిజాంసాగర్ ఆయకట్టు చివరి భూములకు ఊరట లభిస్తుంది. సుమారు 35,000 ఎకరాలకు భరోసా దక్కుతుంది. నిజామాబాద్ రూరల్‌లోని డిచ్‌పల్లి, ధర్పల్లి మండలాల్లో మెట్ట ప్రాంతాల్లోని 18,000 ఎకరాలకు కొత్తగా సాగునీరు ఇవ్వాలని ప్రతిపాదన ఉంది.

మొత్తంగా నిజామాబాద్ జిల్లాలోనే కొత్త స్థిరీకరణ కలిపి సుమారు 1.2 లక్షల ఎకరాలకు, కామారెడ్డి జిల్లాలో 60,000 ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారుల అంచనా.

### 3.5 లక్షల మందికి తీరనున్న దాహార్తి..

వేసవిలో నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలు, 180కి పైగా గ్రామాలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయి. తుమ్మిడి హెట్టి నుంచి ఎస్సారెస్పీ నిండితే మిషన్ భగీరథ పథకానికి నీటి కొరత ఉండదు. నిజామాబాద్ నగరంలో ప్రస్తుతం రోజుకు 45 ఎంజీడీల నీరు అవసరం కాగా, వేసవిలో 30 ఎంజీడీలే సరఫరా అవుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవునా 50 ఎంజీడీల నీటిని తీసుకోవచ్చు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ డివిజన్లలోని 180 గ్రామాలకు, 12 మండల కేంద్రాలకు శాశ్వత తాగునీటి వసతి కలుగుతుంది.

### పరోక్ష ప్రయోజనాలు..

భూగర్భ జలాలు పెరిగి కాలువలు, చెరువులు నిండటంతో జిల్లాలో భూగర్భ జలమట్టం 34 మీటర్లు పెరిగే అవకాశం ఉంది. మరో వైపు సాగునీరు లేక పొట్టచేత పట్టుకుని ముంబై, దుబాయ్ వెళ్తున్న కూలీల వలసలు తగ్గుతాయి. పారిశ్రామికంగా సాగర్‌కు నీరు పుష్కలంగా వస్తే నిజామాబాద్‌లోని రైస్ మిల్లులు, పసుపు, మొక్కజొన్న ఆధారిత పరిశ్రమలకు ఊతం లభిస్తుంది.

### ప్రాజెక్టు స్థితి..

152 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో 1.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో తుమ్మిడి హెట్టి బ్యారేజీని డిజైన్ చేశారు. మహారాష్ట్ర అభ్యంతరాలతో 148 మీటర్లకు కుదించినా, 80వేల ఎకరాలకు నీరివ్వొచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాత్రం 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించాలని చూస్తోంది. ఇంటర్ స్టేట్ వివాదాలు పరిష్కరించి త్వరితగతిన పూర్తి చేస్తేనే జిల్లాకు మేలు జరుగుతుందని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎస్సారెస్పీకి చుక్క నీరు రాని రోజుల్లో తుమ్మిడి హెట్టినే దిక్కు. ఇది పూర్తయితేనే ఉత్తర తెలంగాణ బంగారమవుతుంది' అని నీటిపారుదల శాఖ అభిప్రాయపడుతున్నారు.

## మహిళా సంఘాలకు రుణాలతో ఆర్థికభరోసా

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళా సంఘాలకు రుణాలతో ఆర్థిక భరోసా కలుగుతుందని మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో రుణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మెప్మా పీడీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వడ్డీలేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా చిన్న వ్యాపారాలు, యూనిట్లు ఏర్పాటు చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళా సంఘాలకు రుణాల మంజూరు పత్రాలను అతిథులు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మెప్మా కీలక పాత్ర పోషిస్తోందని ఇతర అధికారులు పేర్కొన్నారు. ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు



అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రవి శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, పీఎంసీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మత్తమాల భాగ్యవతి, మెప్మా అధికారులు, ఆర్‌పీలు, పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రుణాలు పొందిన మహిళలు ప్రభుత్వానికి, మెప్మా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

**అక్షరటుడే, గాంధారి:** రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నేరల్ తండా వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాతృ సంగెం నుండి చద్మల్ వైపు గైని గణేష్, గైని సాయిలు వెళ్తున్నారు. ఈ క్రమంలో నేరల్ తండా శ్మశాన వాటిక వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో గైని గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా ఈఎంటీ సురేష్ పైలెట్ నరేష్ స్పందించారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.



## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బాధితులైన పెద్ద బాలయ్య, గోలి రాజు భాయ్, కేరళ సాయినాథ్, మట్ట గంగాధర్, ప్రశాంత్ కుమార్‌లకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా సరైన ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



## చేపూర్‌లో మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో మహిళ భవనానికి సర్పంచ్ సారంగి శాంతి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్‌లో భాగంగా రూ.10 లక్షల నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చరణ్, కార్యదర్శి హరీష్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్, సీసీ ప్రవీణ్, కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు బద్దం రాజు, కిరణ్ వార్డు మెంబర్లు మమత సాయిలత, ప్రసాద్, గంగామోహన్, నాగరాజు, గ్రామ మహిళసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా..

### స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఫారెస్ట్ అధికారి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** స్విమ్మింగ్ పూల్‌లో మునిగి అటవీ శాఖాధికారి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లి శివారులోని ఈత కొలనులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న చింతకింది శ్రీనివాస్ (43) కామారెడ్డి లో నివాసముంటున్నాడు. గురువారం సాయంత్రం తన కుమారుడిని వెంటబెట్టుకొని నరసన్నపల్లి శివారులోని ఓ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. అక్కడ ఈత కొడుతుండగా, సరిగ్గా ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. వెంటనే గమనించిన అక్కడి సిబ్బంది, స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫారెస్ట్ అధికారి అకాల మరణంతో వెల్దుర్తి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సహోద్యోగులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.



## బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం సక్సెస్ చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ మాజీ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఫామ్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 30న శనివారం జరగనున్న సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యులు సురేష్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు దఫేదార్ రాజు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే సురేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింలు, శ్రవణ్, ఎరుకల సాయిలు, పాల్దే నారాయణ, చర్ల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం విడనాడాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజా వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం విడనాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నా ఇంధన ధరలు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే పెట్రోల్ డీజిల్ గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ఎస్ఐఆర్ పేరుతో తమ పార్టీని విభేదిస్తున్న వారి ఓటు హక్కును కాలరాసే కుట్రలు చేయడం బీజేపీ నాయకత్వంలోని మోదీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. వెంటనే ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలు ప్రజాసంఘాలు వామపక్ష, ప్రతిపక్ష పార్టీలు కలిసి తగిన బుద్ధి చెప్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్ జిల్లా నాయకులు ఎం.వెంకన్న, రాజేశ్వర్, గంగాధర్, సుధాకర్, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు సంధ్యారాణి, గణేష్, అనిల్ కుమార్, అషుర్, సాయిబాబా, ఒడ్డెన్న, సాయరెడ్డి, భాస్కర స్వామి, విఠల్, అమూల్య, రమేష్, చరణ్, సాయిలు, గంగాధర్, సృజన్, మానస, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

